

జిఏపి సర్టిఫికెట్ పొందడానికి కృషి చేయాలి : జెడి

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలో ఎన్నుకోబడిన ఎనిమిది ఎఫ్‌పిఒలు తమ రైతులకు జిఎపి సర్టిఫికెట్ పొందడానికి కృషి చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి చంద్ర నాయక్ సూచించారు. గురువారం పట్టణంలోని జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో జిఎపి పొలంబడిపై అంతర్గత తనిఖీదారులకు, క్యూఎంఎస్ మేనేజర్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్ర నాయక్ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో 28 మండలాల్లో జిఎపి పొలంబడి కార్యక్రమం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఇందులో 23 మండలాలు వేరుశనగ పంట, 3 మండలాలు వరి పంట, 2 మండలాలు సజ్జ పంటలో పొలంబడి కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలో ఎన్నుకోబడిన ఎనిమిది ఎఫ్‌పిఒలు తమ రైతులకు సర్టిఫికెట్ పొందడానికి కృషి చేయాలన్నారు. రైతులు తమ ఉత్పత్తులకు అధిక ధరలను పొందడమే కాకుండా ఎఫ్‌పిఒలకు కూడా లబ్ధి చేకూరుతుందన్నారు. ఎపిఎస్‌ఒపిసిఎ ధ్రువీకరణ సంస్థ గుంటూరు నుంచి వచ్చిన తరుణ్ రెడ్డి అంతర్గత తనిఖీదారులకు తమ విధులు, బాధితులపై శిక్షణ ఇచ్చారు. వివిధ రకాల తనిఖీ జాబితాలను ఏ విధంగా పూరించాలో శిక్షణ ఇచ్చారు.

'ఉక్కు' సంకల్పానికి 'ఏచూరి' ఊతం

- సిపిఎం ప్రధాన కార్యదర్శి మృతి పట్ల దిగ్భ్రాంతి
- జిల్లాకు మూడు సార్లు వచ్చారు
- కడప ఎన్ఆర్‌సి ఉద్యమానికి ప్రోత్సాహం
- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభలకు ముఖ్యఅతిథిగా హాజరు






2017 డిసెంబర్ 13వ తేదీన కడప జిల్లా పరిషత్ ప్రాంగణంలో ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమ సాధన కోసం నిర్వహించిన బహిరంగ సభకు ముఖ్య అతిథిగా హాజరైన సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి స్వాగతం పలుకుతున్న రాష్ట్ర, జిల్లా నాయకత్వం (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి(72) కన్ను మూశారు. ఆయన మృతి పట్ల జిల్లాలో వామపక్ష నాయకులు, అభిమానులు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తున్నారు. శ్వాసకోస, ఇతర ఆరోగ్య సమస్యలతో ఢిల్లీలోని ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్)లో ఆయన చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. ఊపిరి తిత్తులకు సంబంధించిన ఇన్ఫెక్షన్‌తో ఏచూరి ఆగస్టు 19న ఎయిమ్స్‌లో చేరారు. కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని కోరుతూ ఉక్కు సాధన కమిటీ తలపెట్టిన ఉక్కు ఉద్యమానికి సీతారాం ఏచూరి ఊతమిచ్చారు. ఏచూరికి జిల్లా ఉద్యమాలతో కలిగిన అనుబంధాన్ని ఓ సారి అవలోకన చేసుకుందాం. ఏచూరి కడప జిల్లాకు మూడు పర్యాయాలు వచ్చారు. 2017 డిసెంబర్ 13న కడప జిల్లా పరిషత్ ప్రాంగణంలో ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన బహిరంగ సభకు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించిన సంగతి తెలిసిందే. 2014లో రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న హామీని అమలు చేయడంలో కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని అప్పటి టిడిపి సర్కారు చేస్తున్న ద్రోహాన్ని నిరసిస్తూ ప్రసంగించడం ఆకట్టుకుంది. 2014 నుంచి 2017 వరకు జిల్లా, రాష్ట్ర స్థాయి ఉద్యమానికి పరిమితమైన ఉక్కు ఉద్యమం ఒక్కసారిగా జాతీయ స్థాయి ఉద్యమంగా మార్చడంలో సఫలీకృతులు కావడం జిల్లా ప్రజల ప్రశంసలను అందుకుంది. ఈ సందర్భంగా ఆయన బహిరంగసభను ఉద్దేశించి ప్రసంగించారు. విశాఖ ఉక్కు స్ఫూర్తితో కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయడానికి సంబంధించి ప్రత్యేక ఉద్యమ ప్రణాళికను సిద్ధం చేశామని దిశానిర్దేశం చేయడం ఉత్సాహపరిచింది. అప్పటి కేంద్రలోని బిజెపి, రాష్ట్రంలోని టిడిపి ప్రభుత్వాల తీరును పరిశీలిస్తే వాగ్దానాల అమలు ఒట్టి మాటేనని చెప్పారు. పార్లమెంటు లోపల, వెలుపలా ఒత్తిడి తేవాల్సిన అవసరాన్ని ఉద్ఘాటించారు. పాలకులను అడుక్కుంటే వాగ్దానాలను అమలు చేయబోరని, ఉద్యమిస్తేనే సాకారమవుతాయని పిలుపునిచ్చారు. 2020 మార్చి ఏడవ తేదీన కడప నగరంలోని మున్సిపల్ మైదానంలో అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్ఆర్‌సి ఉద్యమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కేంద్రంలోని బిజెపి తీసు కొచ్చిన వివక్షపూరిత ఎన్ఆర్‌సి చట్టాలను తూర్పారబట్టారు. చట్టాలు అందరికీ ఒకే విధంగా ఉండాలని, హిందూ, ముస్లిమ్, క్రిస్టియన్ సహా ఇతర సమూహాలకు ఒక్కో రకంగా ఉంటే వాటిని చట్టాలు అనలేమని గుర్తు చేశారు. ఇటువంటి వివక్షపూరిత రాజకీయాలను నిరసించారు. ఇటువంటి విభజన శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. అభ్యుదయ శక్తులు వివక్షా పూరిత రాజకీయాలను ఎండగట్టాలని దిశానిర్దేశం చేశారు. 2010 డిసెంబర్‌లో నిర్వహించిన ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభలకు ముఖ్య అతిథిగా హాజరై బహిరంగ సభను ఉత్తేజపూరితంగా ప్రసంగించారు. ఎస్ఎఫ్ఐ మాజీ కార్యదర్శి కూడా కావడంతో ఆయన ప్రసంగం యువతను ఉర్రూతలూగించింది. ఏదేమైనా సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి కడప జిల్లా ప్రజలు కష్టాలు, పోరాటాల్లో ఉన్నప్పుడల్లా తాను ఉన్నానంటూ అండగా నిలుస్తూ ప్రోత్సాహించడం ఎంతైనా గుర్తుంచుకోదగిన తీపిగుర్తుగా పేర్కొనొచ్చనడంలో సందేహం లేదు.







నల్ల చట్టాలకు వ్యతిరేకంగా కడపలో నిర్వహించిన సభలో నినాదాలు చేస్తున్న సీతారాం ఏచూరి, డి.రాజా, ఉక్కు బహిరంగ సభలో మాట్లాడుతున్న ఏచూరి, ఏచూరికి స్వాగతం పలుకుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు (ఫైల్ ఫొటోలు)

ప్రజలకు చేరువగా ప్రభుత్వ పథకాలు : కలెక్టర్



విసిలో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

ప్రజాశక్తి-రాయచోటి

ప్రజలకు చేరువగా ప్రభుత్వ పథకాలు తీసుకెళ్లాలని అధి కారులకు కలెక్టర్ చామకూరి శ్రీధర్ అన్నారు. ఈ నెల 17 నుంచి జిల్లా వ్యాప్తంగా 'స్వభావ్ స్వచ్ఛతా-సం స్కార్ స్వచ్ఛతా' కార్యక్ర మాలను పటిష్టంగా నిర్వ హించాలని సంబం ధిత అధికా రులను ఆదేశించారు. గురువారం విజయవాడ నుంచి స్వచ్ఛతాహి సేవ అంశంలో భాగంగా రాష్ట్రంలో ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు చేపట్టనున్న '2024 స్వభావ్ స్వచ్ఛతా-సంస్కార్ స్వచ్ఛతా' కార్యక్రమాలకు సంబంధించి వివిధ శాఖల కార్యదర్శులతో కలిసి రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు అంశాలలో తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు రాయచోటి కలెక్టరేట్ నుంచి కలెక్టర్ శ్రీధర్ చామకూరి పాల్గొన్నారు. విసి అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న స్వచ్ఛతహి సేవా కార్యక్రమాలను పంచాయతీలు, గ్రామాలు, పట్టణాలలో విస్తృతంగా అమలు చేసి పారిశుధ్యం నిర్వహణను మెరుగుపరచాలన్నారు. ఈనెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు '2024 'స్వభావ్ స్వచ్ఛతా-సంస్కార్ స్వచ్ఛతా' కార్యక్రమాలలో భాగంగా స్వచ్ఛతాహి భాగ్యదారి, సంపూర్ణ స్వచ్ఛత, సఫాయి మిత్ర సురక్ష సివిర్స్ అంశాలలో జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా కార్యక్రమాలను అమలు చేయాలన్నారు. అక్టోబర్ 2ను మహాత్మునికి నివాళిగా స్వచ్ఛభారత్ దివస్‌గా పరిగణిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమాలకు సంబంధించి ఈ నెల 13 నుంచి 17 వరకు తగిన కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని, ఇందుకు రోజువారి కార్యక్రమాలకు రూపకల్పన చేయాలన్నారు. సూచించారు. జిల్లావ్యాప్తంగా పరిశుభ్రత లక్ష్య యూనిట్లు (క్లీన్లీనెస్ టార్గెట్ యూనిట్స్)ను గుర్తించాలని సూచించారు. పంచాయితీలు, మున్సిపాలిటీలలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టండి. ఘన, ద్రవ్య వ్యర్థాల నిర్వహణ పక్కగా చేయాలి. ఈ కార్యక్రమాలలో ప్రజలను కూడా విరివిగా భాగస్వామ్యం చేయాలని కలెక్టర్ తెలిపారు. క్లీన్ అండ్ గ్రీన్ పచ్చదనం పెంపులో భాగంగా కార్తీక వనమహోత్సవం వరకు జిల్లా వ్యాప్తంగా విరివిగా మొక్కలు నాటాలని సూచించారు. పారిశుధ్యం నిర్వహణ అంశంలో సాంస్కృతిక పండుగలు నిర్వహించాలన్నారు. ఘన, ద్రవ్య వ్యర్థాల నిర్వహణను తప్పనిసరిగా చేయాలని, ఇందుకు ప్రజల్లో కూడా అవగాహన కలిగించాలని కలెక్టర్ పేర్కొన్నారు. సమావేశంలో డ్వామా, పంచాయతీ, జిల్లా పరిషత్ డిఆర్‌డిఎ, ఆర్డబ్ల్యూఎస్, వైద్య ఆరోగ్యం, ఐసిడిఎస్, మున్సిపల్, టూరిజం తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

సబ్ కలెక్టరేట్‌లో సిఐడి అధికారుల తనిఖీ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్



తహశీల్దార్ కార్యాలయంలో విచారణ అనంతరం బయటకు వస్తున్న డిఎస్‌పి


మదనపల్లెలో సిఐడి అధికారులు గురువారం మదనపల్లి సబ్ కలెక్టరేట్‌తో పాటు తహశీల్దార్ కార్యాలయాలను తనిఖీ చేశారు. ఈ కేసులో ప్రమేయం ఉన్న ఏడుగురిని విచారించారు. సిఐడి డిఎస్‌పి వేణుగోపాల్, సిఐ తెలిపిన వివరాల మేరకు.. మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఫైళ్ళకు నిప్పం టించి దగ్ధం చేసిన విషయం పాఠకులకు విధితమే. అప్పట్లో దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం రేకెత్తించిన ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన కల్యాణ్ ఆదేశాలతో సిఐడి చీఫ్, రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సిసోడియలు మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంకు చేరుకునే అదే రోజే ఫైళ్ల దగ్ధం ఘటనపై విచారణ చేపట్టారు. అనంతరం విభిన్న కోణాల్లో పోలీసులు, వివిధ శాఖల అధికారులు, సిఐడి అధికారులు కేసును లోతుగా దర్యాప్తు చేపట్టారు. ఫైల్ దగ్ధం కేసులో ఇంట్లో ఉండకూడని ఫైలు ఉన్నాయన్న అధికారుల అభియోగంపై మదనపల్లె మాజీ ఎమ్మెల్యే నవాజ్ భాష, మున్సిపల్ వైస్ చైర్మన్ జింక వెంక టాచలపతి, రైస్ మిల్లు మాధవరెడ్డి, మాజీ ఆర్‌డిఒ మురళి, అప్పటి ఆర్‌డిఒ హరి ప్రసాద్, తదితరులపై కేసులు నమోదు చేశారు. ఈ కేసులను నీకు తేల్చడానికి సిఐడి అధికారులు ఇప్పటికి మూడు తపాలు మదనపల్లి కు వచ్చారు. రెవెన్యూ అధికారులను స్థానిక డిఎస్‌పి కార్యాల యానికి పిలపించి విడివిడిగా విచారించారు. వారిచ్చిన స్టేట్మెంట్లను రికార్డు చేసి నివేదికలు సిద్ధం చేసిన సిఐడి అధికారులు ఉన్నతాధికారులకు పంపించారు. కాగా గురువారం సిఐడి డిఎస్‌పి వేణుగోపాల్ మదనపల్లెకు చేరుకుని సబ్ కలెక్టర్ కార్యాలయంతో పాటు, తహసిల్దార్ కార్యాలబ యంలో రికార్డులను తనిఖీ చేశారు. కేసులో ప్రమే యం ఉన్న ఏడుగురిని విచారించారు. సిఐడి అధి కారులు మదనపల్లెకు వచ్చారన్న విషయం తెలు సుకున్న కేసులో ప్రమేయం ఉన్న కొందరు ఫోన్లు స్విచ్ ఆఫ్ చేసుకుని పలాయనం చిత్తగించారు.

'ఏచూరి' మరణం వామపక్ష ఉద్యమానికి తీరని లోటు

-సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాస్త్ర ఏచూరి మరణం వామపక్ష ఉద్యమానికి తీరని లోటని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం స్థానిక సిపిఎం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏచూరి రాజ్యసభకు ఎన్నికై పార్లమెంట్ దృష్టికి ఎన్నో ముఖ్యమైన సమస్యలను తీసుకురావటంతోపాటు వాటిపై ప్రశ్నలు సంధించిన సభ్యునిగా రాజ్యసభలో గుర్తింపు పొందారన్నారు. సమస్యలను సభ దృష్టికి తేవడానికి పార్లమెంటును అడ్డుకోవడాన్ని ఏచూరి సమర్థిస్తారని తెలిపారు. ప్రజాస్వామ్యబద్ధ పాలనలో చట్టబద్ధమైన అంశమని పేర్కొంటారని తెలిపారు. అమెరికా విదేశాంగ విధానాన్ని ఏచూరి తీవ్రంగా వ్యతిరేకిస్తారన్నారు. భారత గణతంత్ర వేడుకలకు బరాక్ ఒబామా ముఖ్య అతిథిగా రావటాన్ని కూడా ఆయన వ్యతిరేకించారని తెలిపారు. ఇస్లాం ఛాందసవాదం పెరగడానికి అమెరికాయే కారణమని తెలిపారన్నారు. ప్రత్యార్థులు సైతం ఏచూరిని పార్లమెంట్‌లో చూడాలనుకుంటారని తెలిపారు. ఆయన ఉద్యమాలను ఆశయాలను ఆదర్శవంతంగా తీసుకొని ఈ జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు, జిల్లా కమిటీ సభ్యులు ఎ.రామాంజులు, రవికుమార్, చంద్రశేఖర్, రాజేశ్వరి, మణి, శాఖా కార్యదర్శులు హరిశర్మ, ఓబులమ్మ, వెంకటచలపతి, వెంకట్రామిరెడ్డి, బాలకృష్ణ, మాధవయ్య పాల్గొన్నారు



ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

ఏచూరి మరణం దేశానికి తీరని నష్టం : వైసిపి

సీతారం ఏచూరి మరణం భారత దేశానికి, వామపక్ష ఉద్యమానికి తీరనిలోటని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. దేశం ఒక ప్రజాపోరాట యోధుడిని కోల్పోయిందన్నారు. విలువలు, సిద్ధాంతాల కలబోతగా తన రాజకీయ ప్రస్థానాన్ని చివరి వరకు కొనసాగించిన సీతారం ఏచూరి ఆదర్శ ప్రాయులని, వారు చేసిన పోరాటాలు ఎప్పటికీ స్ఫూర్తిదాయకమన్నారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని ఆయన ఆకాంక్షించారు.

సీతారాంకు సిపిఐ నివాళి

సీతారాం ఏచూరి మరణం వామపక్ష ఉద్యమాలకు, పీడిత ప్రజలకు తీరని లోటని సిపిఐ పీలేరు నియోజకవర్గ కార్యదర్శి టిఎల్ వెంకటేష్ అన్నారు. ఆయన మృతికి నివాళులర్పించారు. మార్క్సిస్టు మేధావి సీతారాం ఏచూరి మరణం కార్మికవర్గానికి తీరని లోటని సిపిఐ మదనపల్లె నియోజకవర్గ కార్యదర్శి కె.మురళీ పేర్కొన్నారు.

ఆడిటర్స్ సమస్యల పరిష్కారానికి కృషి

ఎపిటిపిసిఎ రాష్ట్ర ముఖ్య సలహాదారు షరీఫ్‌ఖాన్



మాట్లాడుతున్న రాష్ట్ర ముఖ్య సలహాదారు షరీఫ్‌ఖాన్

ప్రజాశక్తి-కడప అర్బన్

రాష్ట్రంలో ఆడిటర్స్, టాక్స్ ప్రాక్టీ షనర్స్, కన్సల్టెన్సీ ఎదుర్కొంటున్న సమస్యలను పరి ష్కరించాలని ఆంధ్రప్రదేశ్ టాక్స్ ప్రాక్టీషనర్స్ కన్సల్టెన్సీ అసోసియేషన్ ముఖ్య సలహాదారు పఠాన్ షరీఫ్‌ఖాన్ కోరారు. గురువారం శ్రీనివాస రెసి డెన్సిలో వైయస్సార్, అన్నమయ్య జిల్లాల నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో షరీఫ్‌ఖాన్ మాట్లాడుతూ అసోసియేషన్ భవన నిర్మాణానికి జిల్లాలలో ఐదు సెంట్ల స్థలాన్ని ప్రభుత్వం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఇళ్ల స్థలాలు లేని ఆడిటర్లకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని కోరారు. ఆడిటర్ లేనిదే ప్రభుత్వానికి ఆదాయం లేదని తెలిపారు. ఇన్‌కం టాక్స్‌పై అవగాహన కోసం ప్రతినెల కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. రాష్ట్ర అధ్యక్షులు శ్రీని వాసరావు మాట్లాడుతూ ఐకమత్యంగా ఉంటే సమస్యలు పరిష్కారం అవుతాయని, అధికారము సాధించేందుకు వీలవుతుందని తెలిపారు. అందుకే అసోసియేషన్ అవసరమని చెప్పారు. ఇన్‌కం టాక్స్ రిటర్న్ నవంబరు, డిసెంబరు వరకు పొడిగించాలని కోరతామన్నారు. కేరళ, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో వరదలు వచ్చి ప్రజా జీవితాన్ని అతలాకుతలం చేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలు ఉంటే నాయకత్వ దృష్టికి తీసుకురావాలని కోరారు. కోవిడ్ సమయంలో ఎంతోమందిని ఆదుకున్నామని చెప్పారు. కడపలో అసోసియేషన్ భవనం నిర్మిస్తే రూ.2 లక్షలు ఇస్తామని ప్రకటించారు. ఆదాయ మార్గాలు పెంచుకోవాలని తెలిపారు. జిల్లా కార్యదర్శి జయకృష్ణ మాట్లాడుతూ అసోసియేషన్ ద్వారా వృత్తి సమస్యలు పరిష్కారమవుతాయని పేర్కొన్నారు. అందుకే అవగాహన సదస్సుల ద్వారా సందేహాలు నివృతి అవుతాయని తెలిపారు. అనంతరం వైయస్సార్, అన్నమయ్య జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా పోసా మల్లికార్జున, ఉపాధ్యక్షులుగా గండికోట శివకుమార్, కార్యదర్శిగా జయకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసులు, సంయుక్త కార్యదర్శిగా వడ్డీ నాగరాజు, అష్రఫ్ అలీఖాన్, పఠాన్ తౌహీద్‌ఖాన్, కోశాధికారిగా శ్రీనివాసులు, ఇసి మెంబర్స్ ఎన్నుకున్నారు. అనంతరం సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు, నూతన కమిటీని అభినందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు వరదరాజులు, చంద్రశేఖర్, శివకుమార్, గౌరవాధ్యక్షులు కుమార్, చంద్రమౌళి, శ్రీనివాసరావు, సత్యనారాయణ రాజు, ఆదినారాయణరెడ్డి, ఆడిటర్స్, టాక్స్ ప్రాక్టీషనర్స్, లయన్ పఠాన్ మన్సూర్ అలీఖాన్, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



ప్రశంసా పత్రాలు అందుకుంటున్న విద్యార్థులు

రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీలకు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి-రాయచోటి

రాష్ట్ర స్థాయి రెడ్ రిబ్బన్ క్విజ్ పోటీలకు సంబేపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ 10వ తరగతి విద్యార్థులు రుక్సానా, రుక్సార్‌లు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి తెలిపారు. గురువారం ఉదయం పాఠశాలలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను, వీరికి శిక్షణ ఇచ్చిన జీవశాస్త్ర ఉపాధ్యాయుడు మార్ల ఓబుల్‌రెడ్డిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి సూచనల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, విద్యాశాఖ సంయుక్తంగా నిర్వహించిన జిల్లాస్థాయి రెడ్ రిబ్బన్ క్విజ్ పోటీలలో వీరు జిల్లాలో మొదటి స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారని అన్నారు. 18న విజయవాడ లోని కేఎల్ యూనివర్సిటీలె నిర్వహించే రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలలో పాల్గొంటారన్నారు. జిల్లాస్థాయిలో ప్రతిభ చూపిన వీరికి వైద్య ఆరోగ్యశాఖ వారు రూ.5 వేలు నగదు బహుమతిని అందించారన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యా యులు చంద్రశేఖర్, విజయ సారధిరెడ్డి, రామయ్య, దేవ ప్రసాద్ రెడ్డి, పఠాన్ మహబూబ్ బాషా, రెడ్డి శేఖర్, సురేంద్ర రాజు పాల్గొన్నారు.

104 సేవలు తనిఖీ చేసిన డిపిఎంఒ

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

మండలం లోని యండపల్లి పిహెచ్‌సి పరిధిలోని నక్కావాండ్లపల్లిలో నిర్వహిస్తున్న 104 వైద్య సేవలను జిల్లా జాతీయ ఆరోగ్య మిషన్ పర్యవేక్షణ అధికారి డాక్టర్ రియాజ్ బేగ్ , డిఎన్ఎంఒ డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. దిగువ అబ్బవరం ఆరోగ్య కేంద్ర పరిధిలో షుగర్, బిపి వ్యాధిగ్రస్తులు సక్రమంగా 104 సేవలు పొందుతున్నారా అని డేటాను పరిశీలించారు. వయోజనుల బిసిజి టీకా కార్యక్రమంలో లక్ష్యాలను పూర్తి చేశారా లేదా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. 104 సేవలకు వచ్చే గర్భిణులకు అవసరమైన వారికి ఇసిజి పరీక్షలు చేయాలని, ఒపి పెంచాలని ఆదేశించారు. ఎంఎల్‌హెచ్‌పిలు ప్రతీ బుధవారం నీటి నాణ్యత పరీక్షలు తప్పనిసరిగా నిర్వహించాలని, ఫలితాలు యాప్‌లో అప్‌డేట్ చేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న డిపిఎంఒ


గుంతలమయంగా మారిన మట్టిరోడ్డు

సిసి రోడ్డు మంజూరు చేయండి

ప్రజాశక్తి-సుండుపల్లి

సుండుపల్లె గ్రామపంచాయతీలోని అగ్రహారం సమీపంలో పీలేరు-సుండుపల్లె మెయిన్ రోడ్డు పక్కన ఉన్న వీధిలో సిమెంట్ రోడ్డు లేక అనేక ఇబ్బందులు పడుతున్నామని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. అనేక ప్రభుత్వాలు మారుతున్నా మా తలరాతలు మాత్రం మారలేదని గ్రామంలో అభివృద్ధి కనిపించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు ప్రజాప్రతినిధులకు దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకున్న వారే లేరని అన్నారు. సిసి రోడ్లు వేయకుండానే వేసినట్టు బిల్లులు చేసుకున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయని అన్నారు. రోడ్డంతా గుంతలమయంగా ఉండటంతో రాత్రి వేళలో వెళ్లాలంటే భయంగా ఉందని మహిళలు పేర్కొంటున్నారు. అనేకసార్లు మండల అధికారులు దృష్టికి తీసుకెళితే మీ వీధికి సిసి రోడ్డుకు ప్రతిపాదనలు పంపించామని త్వరలోనే మంజూరు అవుతుందని చెబుతున్నారనే తప్ప ఇంత వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని అన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సిసి రోడ్డు ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-కలికిరి

ఉర్దూ జువాలజీ గెస్ట్ ఫ్యాకల్టీ పోస్ట్‌కు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల (ఉర్దూ) మహల్ ప్రిన్సిపల్ నాగ సురేష్ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహల్ ఉర్దూ కళాశాలలో జువాలజీ, ఉర్దూ బోధించుటకు ఆసక్తి కలిగిన అభ్యర్థులు కళాశాల ప్రిన్సిపల్‌ను వెంటనే సంప్రదించాలని కోరారు. గెస్ట్ ఫ్యాకల్టీ పని చేయుటకు గ్రాడ్యుయేషన్ చేసి జువాలజీ సబ్జెక్ట్‌లో కనీసం 50శాతం మార్కులు సాధించి ఉండాలన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎంపిక చేయడం జరుగుతుంది అని కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ ఒ.నాగసురేష్ తెలిపారు. వివరాలకు 9441433850 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

బోధనేతర సిబ్బంది ఉద్యోగాలకూ..

బి.కొత్తకోట : మండలంలోని ఆదర్శ బాలికల వసతి గృహంలో సిబ్బంది కొరత ఏర్పడింది. పాఠశాల బాలికల వసతి గృహం లో రోజువారి కూలీ పనులు చేస్తున్నటువంటి వారు అనారోగ్య రీత్యా నిలిచిపోవడం వలన బాలికల వసతి గృహంలో సిబ్బంది కొరత ఏర్పడింది. అసిస్టెంట్ కుక్, చౌకీదారు, వాచ్ ఉమెన్ వంటి ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, ఆసక్తి కలిగిన మహిళలు బి.కొత్తకోట ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శీను నాయక్ ను సంప్రదించాలని పాఠశాల కార్యాలయం గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది.


పుల్లంపేట: లడ్డును దక్కించుకున్న జంబు నరసింహులు దంపతులు

రూ.3 లక్షలు పలికిన శ్రీనివాసపురం లడ్డు

ప్రజాశక్తి-చిన్నమండెం

మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామ పరిధిలోని శ్రీనివాసపురంలో ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమ వద్ద గురువారం లడ్డూ వేలం నిర్వహించారు. ఒర్సు జయచంద్రారెడ్డి రూ.3లక్షలకు పాడి లడ్డూను దక్కించుకున్నారు. ఒర్సు వెంకటస్వామి చిన్న కుమారుడు అయిన జయచంద్ర లండన్‌లో సాఫ్ట్ వేర్ ఉద్యోగం చేస్తున్నారు. మూడు లక్షల పాట పాడి లడ్డూను దక్కించుకోవడంతో ఉత్సవ కమిటీ సభ్యులు ఆయన కుటుంబాన్ని ఘనంగా సత్కరించారు.

రూ.35 వేలు పలికిన అనంతంపల్లి...

పుల్లంపేట: మండల పరిధిలోని అనంతంపల్లి పంచాయతీ జానకీపురం గ్రామంలో వినాయక చవితి నిమజ్జనం పురస్కరించుకొని భారీ స్థాయిలో లడ్డూ వేలం పాట పలకడం జరిగింది. లడ్డు వేలం పాటకు ఆశావహులు ప్రయత్నించగా చివరికి జంబు నరసింహులు దర్మపత్ని జంబు సుబ్బర రూ.35వేలకు వినాయక లడ్డును దక్కించుకున్నారు. ఎస్ఐ మోహన్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిమజ్జనం నిర్వహించారు.

ఎస్ఐగా వెంకటసుబ్బయ్య బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-రామసముద్రం



రామసముద్రం ఎస్ఐగా సి.వెంకట సుబ్బయ్య గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణ అనుక్షణ కృషి చేస్తానని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలు, జూదం, అక్రమ మద్యం తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలిపారు. మండలంలో శాంతిభద్రతలు పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ చంద్రశేఖర్ వాయల్పాడుకు బదిలీ అయ్యారు.

వైభవంగా వెంకన్న పవిత్రోత్సవం

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండలంలోని కోసవారిపల్లెలో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో టిటిడి ఆధ్వర్యంలో వైభవంగా పవిత్రోత్సవాలు ప్రారంభించినట్లు టిటిడి డిప్యూటీ ఇఒ వరలక్ష్మి తెలిపారు. ఆలయంలో సాయంత్రం ప్రధాన అర్చకులు కృష్ణ ప్రసాద్ బట్టర్, ఆలయ ప్రధాన అర్చకులు రమేష్ బాబుల ఆధ్వర్యంలో స్వామివారికి పవిత్ర సేవ నిర్వహించారు. భగవద్ ఆరాధన, అంకురార్పణ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు స్వామివారి దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలను అందించారు. ఈ పవిత్రోత్సవాలు నాలుగు రోజులపాటు జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఇన్స్‌పెక్టర్ దిశంత్ కుమార్, వేద పండితులు పాల్గొన్నారు.

రాయచోటిని పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి : అన్నమయ్య జిల్లా నూతనంగా ఏర్పడిన తర్వాత పారిశ్రామికంగా అభివృద్ధి చేయవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని సిపిఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ జిల్లా బాధ్యుడు ఎం.అంకన్న తెలిపారు. గురువారం విజయవాడలో రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి కలిసి చర్చించారు. ఈ సందర్భంగా అంకన్న మాట్లాడుతూ రాయచోటి జిల్లా కేంద్రంగా ఏర్పడిన తరువాత అభివృద్ధికి ఎంతో ఆవశ్యకత ఏర్పడిందని, ఇక్కడ పారిశ్రామిక అభివృద్ధి కి కావాల్సిన భూమి ఉందని అన్నారు. జిల్లా వ్యాప్తంగా చదువుకున్న యువత ఉపాధి అవకాశాలు లేక బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, గల్ఫ్ దేశాలకు వలసలు వెళుతున్నారని అన్నారు. రాయచోటి ప్రాంతంలో కావాల్సినంత భూమి పారిశ్రామిఖ అభివృద్ధికి ఉందని ఎందుకు తగ్గ పారిశ్రామిక వాడల ఏర్పాటు చేయాలని తెలిపారు.

క్షయ రహిత సమాజం కోసమే బిసిజి టీకా

ప్రజాశక్తి-కలికిరి

క్షయ రహిత సమాజం కోసం వయోజనులు బిసిజి టీకాను వేయించుకోవాలని మెడికుర్తి పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ చిన్న రెడ్డెప్ప, హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, టిబి పర్యవేక్షకులు నాగిరెడ్డి అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఆదేశాల మేరకు మండలం లోని మెడికుర్తి పిహెచ్‌సి పరిధిలోని కలికిరి మండల కేంద్రంలోని ఎంఇఒ కార్యాలయ ప్రాంగణంలో ఎంఇఒ కరీముల్లా సహకారంతో మండలంలోని 53 మంది ఉపాధ్యాయులకు, గ్రామ పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో 49 మంది ఆటో, టాక్సీ డ్రైవర్లకు ఎస్ఐ సహకారంతో టీకా వేసినట్లు తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సోమ, గురువారాల్లో పెద్దలకు టిబి జబ్బు రాకుండా బిసిజి టీకాలు ఆరోగ్య కేంద్రాల్లో వేస్తారని తెలి పారు. 60సంవత్సరాలు పైబడిన వారు, షుగర్‌వ్యాధి గ్రస్థులు, బీడీ, సిగరెట్ తాగువారు, టిబి వచ్చి తగ్గిపోయి బాగైన వారు, టిబి రోగితో కలిసి జీవించిన వారు, ఎత్తుకు తగ్గ బరువు18 కిలోల కంటే తక్కువ ఉన్న వారు తప్పనిసరిగా బిసిజి టీకా వేసుకోవాలని తెలిపారు. టిబి ముక్త్ భారత్ లక్ష్యం సాధనకు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ కొండప్ప, ఉపాధ్యాయులు, మండల రిసోర్సు పర్సన్స్, ఎంఎల్. హెచ్‌పిలు, కృష్ణ కుమారి, సాయిరరాం, పావని, ఎఎన్ఎం మాధవి, రమాదేవి, పార్వతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులకు బిసిజి టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి : ఎంఇఒ


నిమ్మనపల్లి : క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎంఇఒ నారాయణ

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని మండల విద్యాశాఖ అధికారి నారాయణ అన్నారు. గురువారం స్థానిక జడ్‌పి హైస్కూల్ (తెలుగు) క్రీడా మైదానంలో స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ ఆదేశాల మేరకు ఎంఇఒ ఆధ్వర్యంలో అండర్-14, అండర్-17 విభాగాలకు చెందిన బాల, బాలికలకు మండల స్థాయి క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒ నారాయణ క్రీడల పోటీలను ప్రారంభించారు. క్రీడలతో విద్యార్థులు శారీరక ధారుడ్యం, మానసిక ఉల్లాసంతో పాటు ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. ప్రతి విద్యార్థి తమకు నచ్చిన క్రీడల్లో పాల్గొని రాణించాలని సూచించారు. మండలంలో రెండు రోజులపాట క్రీడా పోటీలను నిర్వహిస్తున్నామని, అన్ని పాఠశాలల విద్యార్థులు పాల్గొంటున్నట్లు తెలిపారు. గురువారం స్కూల్లో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్, యోగా, చదరంగం వంటి క్రీడా విభాగాల్లో పోటీలను నిర్వహించామన్నారు.శుక్రవారం అథ్లెటిక్స్ పోటీలను నిర్వహిస్తామని తెలిపారు. మండలస్థాయి పోటీలలో గెలుపొందిన విద్యార్థులు నియోజకవర్గ స్థాయిలో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఇన్ ఛార్జి హెచ్‌ఎం వాణి, పీడీలు భద్రయ్య, గీతాశ్రీ, రెడ్డి కిరణ్, పీఈటీలు మణికుమార్, సుజాత, ఉపాధ్యాయులు వెంకట గోపాల్, రవి జయశ్రీ, సహదేవరెడ్డి పాల్గొన్నారు. **రామాపురం :** చిన్నతనం నుంచే క్రీడలు పట్ల మక్కువ పెంచుకుంటే శారీరక, మానసిక దృఢత్వానికి దోహదపడతాయని ఎంఇఒ రామకృష్ణుడు పేర్కొన్నారు. మండలంలోని నీలకంఠరావుపేట జడ్‌పి హైస్కూల్‌లో ఎస్‌జిఎఫ్ మండల స్థాయి క్రీడలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుండే చదువుతోపాటు క్రీడల పట్ల మక్కువ పెంచుకోవాలన్నారు. విద్యార్థులు ఆటలు ఆడేటప్పుడు క్రీడా స్ఫూర్తిని అలవర్చుకోవాలన్నారు. అనంతరం అండర్-14 చెస్‌లో తేజ వెంకటరామిరెడ్డి, మృదుల వసంత సత్తా చాటారు. అండర్-17లో అజయ్, శ్రీకాంత్, హరిత, యామిని గెలిచారన్నారు. 100 మీటర్ల పరుగు పందెంలో మనోజ్, తరుణ్, సౌమ్య, లహరి, బుజ్జి, గీతాంజలి, జావలిన్‌త్రోలో బాలాజీ, హర్ష, సౌమ్య నందిని గెలుపొందారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుజాతమ్మ, మండల కో-ఆర్డినేటర్ నరేంద్ర కుమార్‌రెడ్డి, పీడీలు రెడ్డయ్య, ఆంజనేయులు, జహీర్, గ్రామ ఉపసర్పంచ్ మహబూబ్ బాషా, స్కూల్ కమిటీ చైర్మన్ నీయాజ్ పాల్గొన్నారు. **నందలూరు:** మండల కేంద్రంలోని నందలూరు జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి క్రీడా పోటీలను ఎంఇఒలు ఎల్. నాగయ్య, సిఆర్ ఆనంతకృష్ణ, హెచ్‌ఎం ఎన్. శ్రీనివాసులు, స్కూల్ గేమ్స్ మండల కో-ఆర్డినేటర్ క్రిష్ణయ్య, అసిస్టెంట్ హెచ్‌ఎం షేక్ రౌఫ్‌బాషాలు ప్రారంభించారు. అండర్-14, అండర్ -17 విభాగాల్లో విడివిడిగా బాల బాలికలకు కబడ్డీ, ఖోఖో,వాలీ బాల్, షటిల్ తదితర 7 క్రీడల్లో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని కోరారు.శుక్రవారం అరవపల్లె క్రీడా మైదానంలో మిగిలిన పోటీలు అనగా చెస్, యోగా, అథ్లెటిక్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండలం లోని వ్యాయామ ఉపాధ్యాయులు గౌరీ, సరిత, సునీత, సుష్మిత, విశ్వనాథ్, గణేష్, జగన్, విద్యార్థులు పాల్గొన్నారు.

19న ఎస్‌జిఎఫ్ క్రీడా ఎంపికలు

బి.కొత్తకోట : నియోజకవర్గంలోని బి.కొత్తకోట మండల పరిధిలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు ఈనెల 19,20 తేదీల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ టోర్నమెంట్, సెలక్షన్లు నిర్వహిస్తున్నట్లు జడ్‌పి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు భువనేశ్వరి పేర్కొన్నారు. గురువారం పాఠశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ రెండు విభాగాలు ఈ ఎంపికలు జరుగుతాయని అండర్-14 విభాగంలో పాల్గొనే విద్యార్థులు జనవరి 1,2011లోపు, అండర్-17 విభాగంలో పాల్గొనే విద్యార్థులు జనవరి1, 2008లోపు జన్మించిఉండాలన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్, యోగా, చెస్ , అథ్లెటిక్స్ క్రీడల్లో మండల స్థాయి విద్యార్థులకు పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు ప్రతిభ కనబరిచిన విద్యార్థులు నియోజకవర్గస్థాయి పోటీలకు ఎంపికవవుతారన్నారు. 19న కబడ్డీ, ఖోఖో, వాలీబాల్,చెస్ పోటీలు, 20న అథ్లెటిక్స్,యోగా,షటిల్ క్రీడా పోటీలను స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మండల విద్యాశాఖ అధికారుల సమక్షంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ క్రీడా పోటీలకు ఎంఇఒలు రెడ్డిశేఖర్, భీమేశ్వరాచారి మండల కో-ఆర్డినేటర్ తాజ్‌బాషా వ్యవహరిస్తారని తెలిపారు.ఈ అవకాశాన్ని మండల విద్యార్థుల సద్వినియోగం చేసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మండలంలోని పిఇటిలు, పీడీలు పాల్గొన్నారు.

పుల్లంపేట : మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కొత్తపేట నందు గురువారం నిర్వహించిన మండల స్థాయి ఎస్‌జిఎఫ్ క్రీడా పోటీలు మండల విద్యాశాఖ అధికారులు చక్రధర్‌రాజు, నాగ తిరుమలరావు ఆధ్వర్యంలో అట్టహాసంగా నిర్వహించారు. ఈ క్రీడా పోటీల్లో మండల వ్యాప్తంగా ఉన్న ఎనిమిది స్కూల్ కి సంబంధించిన క్రీడాకారులు పాల్గొన్నారు. స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున, మండల కో-ఆర్డినేటర్ బాల శేఖర్ ఆధ్వర్యంలో మొత్తం 7 క్రీడ అంశాలలో నిర్వహించిన పోటీలలో చెస్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ మొదలగు 5 గ్రేడ్ అంశాలను మాత్రమే పూర్తి చేసినట్లు బాలశేఖర్ తెలిపారు.



నందలూరు : గెలుపొందిన క్రీడాకారులతో నిర్వాహకులు

వ్యక్తిగత క్రమశిక్షణతో ఉజ్వల భవిష్యత్తు : ఎంపిడిఒ


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపిడిఒ

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పిటిఎం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంపిడిఒ కెఎన్.బాలాజీ, ఎంఇఒ-2 గౌస్‌పీర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. 242 విద్యార్థులకుగాను 240 మంది హాజరైనట్లు గుర్తిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణ, ఏకాగ్రతతో చదివితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని అన్నారు. విద్యార్థులు మంచి నడవడికతో వ్యక్తిగత పరిశుభ్రతను, ఆరోగ్య సూత్రాలను పాటిస్తూ విద్యార్థులు మంచి ప్రణాళికతో చదవాలని అన్నారు. ఆహార పదార్థాల నాణ్యత గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఏఏ అం శాలలో వెనుకబడి ఉన్నారో ముందుగా గుర్తించి అదనపు సమయాన్ని కేటాయించడం ద్వారా విద్యార్థులు అన్ని సబ్జెక్టులో మంచి మార్కులు సాధించేందుకు సాధ్యపడుతుందని అన్నారు. పాఠశాలకు ప్రహరీ నిర్మాణం,సిమెంటు రోడ్డు కావాలని ప్రిన్సిపల్ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శివకుమారి, అధ్యాపకుల పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పంచాయతీల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని ఎంపిడిఒ బాలాజీ పేర్కొన్నారు. గురువారం పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించి పలు సూచనలు,సలహాలు అందజేశారు. పారిశుధ్య నిర్వహణ కార్యక్రమాలను నిరంతరం చేపట్టాలని, ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్యను పెంచాలని, గృహ నిర్మాణ పనులను వేగవంతం చేసే విధంగా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి సోమ, గురువారం వెల్ఫేర్ అసిస్టెంట్లు పాఠశాలలను సందర్శించాలని అన్నారు. అక్టోబర్ 2 నాటికి అన్ని గ్రామ పంచాయతీలలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకొని రావాలని అన్నారు. జిల్లా అధికారుల ఆదేశం మేరకు గ్రామపంచాయతీలలో తప్పనిసరిగా పారిశుధ్య నిర్వహణ కార్యక్రమాలను చేపట్టాలని తెలిపారు. ఈ సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు, పంచాయతీ విస్తరణ అధికారి యోగానంద, హౌసింగ్ అసిస్టెంట్ ఇంజినీర్ శ్రీనివాసులు, ఉపాధి హామీ ఎపిఒ తిరుపాలప్ప పాల్గొన్నారు.


పంచాయతీ కార్యదర్శులకు సూచనలు ఇస్తున్న ఎంపిడిఒ

ప్రాథమిక విద్య బలోపేతం మనందరి బాధ్యత : సిడిపిఒ


మాట్లాడుతున్న సిడిపిఒ రాజమ్మ

ప్రజాశక్తి-పీలేరు

ప్రీస్కూల్ విద్యార్థి ప్రగతి అంగన్వాడీ స్కూల్‌లో ప్రారంభమై దినదిన అభివృద్ధి చెందుతారని అందుకు ఐసిడిఎస్ ప్రాజెక్టు టీచర్స్ పర్యవేక్షకులు మేలైన కృషి చేసి, పిల్లల హాజరు, వారి పౌష్టికాహారం, జీవనశైలి మీద, ప్రత్యేక శ్రద్ధ వహించాలని సిడిపిఒ రాజమ్మ, అంగన్వాడీ కార్యకర్తలకు సూచించారు. గురువారం పట్టణ ఐసిడిఎస్ కార్యాలయ ప్రాంగణంలో ఐసిడిఎస్, ఆరోగ్యశాఖలు సమన్వయంతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టరు చంద్రశేఖర్ నాయక్ మాట్లాడుతూ పల్లెల్లో అంటువ్యాధులు అరికట్టడంలో అంగన్వాడీ టీచర్ల సహకారాలు అందించాలని, అన్నారు. పిల్లల కుటుంబ సభ్యులకు దోమల వల్ల, కలుషిత ఆహారం, నీరు పిల్లలు, పెద్దల ఆరోగ్యంపై చెడుప్రభావం చూపకుండా గ్రామీణులకు ఆరోగ్యవిద్య ఆవశ్యకతను వివరించారు. పల్లెల్లో చౌకగాదొరికే తాజా ఆకు కూరలు, కాయగూరలు తరచు 300 గ్రాములు తీసుకోవాలని, ఆకుకూరల్లో ఆరోగ్యం దాగి ఉందని సిడిపిఒ రాజమ్మ అన్నారు. కార్యక్రమంలో తలుపుల వైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్, పీలేరు, కె.వి పల్లి, కలకడ, ఐసిడిఎస్ సూపర్‌వైజర్‌లు ఉమ, అక్కయ్య, స్వరూప, స్వప్న, శాంతి, భారతి, యశోద, పీలేరు టిబి నియంత్రణ విభాగం సిబ్బంది పవన్, మోహన్, కుసుమ పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న పులపుత్తూరు దళితవాడ ప్రజలు

దాడి చేసిన వైసిపి నేతలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

గణేష్ నిమజ్జనం సందర్భంగా వైసిపికి చెందిన అగ్రవర్ణాల వారు తమపై దాడి చేసి హుందాగా తిరుగుతున్నారని, వారిపై వెంటనే చర్యలు తీసుకుని న్యాయం చేయాలని పులపుత్తూరుకు చెందిన దళితులు పేర్కొన్నారు. సోమవారం పులపత్తూరు దళితవాడ ప్రజలు గణేష్ నిమజ్జనం సందర్భంగా వైసిపికి చెందిన అగ్రవర్ణాల ఇంటి ముందు డిజెతో పాటు బాణాసంచా పేల్చారని వైసిపి వారు దళితులపై దాడికి పాల్పడ్డారని అన్నారు. దాడికి పాల్పడిన వారిపై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు గురువారం ఆర్‌అండ్‌బి అతిథి గృహం వద్ద గల అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ తాము 2014 నుంచి టిడిపిలో క్రియాశీలకంగా ఉంటూ పనిచేస్తున్నామని, తమను వైసిపి కార్యకర్తలుగా దుష్ప్రచారం చేయడం తగదని తెలిపారు. దాడిలో గాయపడిన కుంభగిరి వెంకట సుబ్బయ్య టిడిపి పార్టీ క్రియాశీలక సభ్యత్వ కార్డు చూపించి మాట్లాడుతూ అగ్రవర్ణాలకు చెందిన వైసిపి నేతల నుంచి తమకు ప్రాణహాని ఉందని, పోలీసులు బాధ్యులపై చర్యలు తీసుకొని వెంటనే అరెస్టు చేసి తమకు న్యాయం చేయాలని కోరారు. లేనిపక్షంలో కుటుంబంతో కలిసి మూకుమ్మడిగా ఆత్మహత్య చేసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో దళితవాడ ప్రజలు పాల్గొన్నారు.

వరద బాధితులకు 'మిట్స్' విద్యార్థుల సాయం

ప్రజాశక్తి-మదనపల్లి

అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ వాలంటరీలు విజయవాడ వరద బాధితుల కోసం కళావాలలోని విద్యార్థులతో కలిసి రూ.51000లు సిఎం సహాయనిధికి అందించినట్లు ప్రినిపల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. కళాశాలలోని విద్యార్థులు, అధ్యాపకులు తమవంతు సహాయంగా వరద బాధితుల సహాయార్థం అందిచినట్లు పేర్కొన్నారు. తల్లిదండ్రులు ఇచ్చిన నగదును దాచి పెట్టుకున్న విద్యార్థులు విజయవాడ వరద బాధి తులకు అందించారని చెప్పారు. విద్యార్థులో ఆధ్వర్యంలో రూ.51 వేల నగదును ముఖ్యమంత్రి సహాయనిధికి పంపినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కమల్‌బాషా, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ రాజేష్, ఎన్ఎస్ఎస్ వాలంటరీలు పాల్గొన్నారు.


ప్రిన్సిపల్‌కు చెక్కును అందిస్తున్న విద్యార్థులు

క్రైం కార్నర్

ఆటోను ఢీకొన్న ద్విచక్ర వాహనం

- డ్రైవర్ మృతి, మరో ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి-పీలేరు

ఆటో, ద్విచక్ర వాహనం ఢీకొని ఒకరు మృతి చెందగా, మరో ముగ్గురు గాయపడిన సంఘటన పీలేరులో చోటు చేసుకుంది. పీలేరు మండలం, కాకులారం పల్లి పంచాయతీ, ఇందిరమ్మ కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ వి.బాషా(40), స్థానిక తిరుపతి రోడ్డులోని కృష్ణా నగర్‌కు చెందిన మునిరాజమ్మ అనే మహిళా ప్రయాణీకురాలితో తిరుపతి రహదారిలోకి చేరుకున్న ఆటోను, కెవి పల్లి మండలం, మద్దిపట్లవాండ్లపల్లికి చెందిన ఎం. పవన్ కుమార్ రెడ్డి, పీలేరు బండ్లవంకకు చెందిన విశాల్ అనే విద్యార్థులు ద్విచక్ర వాహనంపై తిరుపతి వైపు వెళుతూ స్థానిక ఆర్‌టిఒ కార్యాలయం సమీపంలో ఎదురుగా వచ్చిన ఆటోను వేగంగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వి. బాష, పవన్ కుమార్‌రెడ్డి, స్వల్పంగా గాయపడిన విశాల్, ఆటోలోని మహిళా ప్రయాణికురాలు ముని రాజమ్మలను స్థానిక ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం ఆటో డ్రైవర్ బాషను, పవన్ కుమార్ రెడ్డిలను తిరుపతికి తరలించారు. ఆటో డ్రైవర్ తిరుపతి రుయాలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ప్రజాశక్తి-బి కొత్తకోట : అక్రమంగా కర్ణాటక మద్యాన్ని విక్రయిస్తున్న ఇద్దరిని గురువారం బి.కొత్తకోట పోలీసులు అరెస్టు చేశారు. సిఐ రాజారెడ్డి తెలిపిన వివరాల మేరకు..మండలంలోని తాకాటంవారిపల్లి సమీపంలో అదేగ్రామానికి చెందిన వెంకటరమణ అనే వ్యక్తి కర్ణాటక మద్యం అక్రమంగా అమ్ముతున్నాడని సమాచా రం వచ్చిందన్నారు. తమ సిబ్బందితో దాడి చేసి అతని వద్ద ఉన్నటువంటి 210 ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామని అక్కడే అతని కొడుకు వివేక్ పరారయ్యాడని తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. గట్టు పంచాయితీ, పత్రవారిపల్లిలో గోపాల్ అనే వ్యక్తి కర్ణాటక మద్యం విక్రయిస్తుండగా అతని వద్ద ఉన్నటువంటి 52 కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని మదనపల్లి కోర్టుకు హాజరు పరచగా కోర్టు ఆదేశాల మేరకు రిమాండుకు తరలించినట్లు తెలిపారు.

హత్యాయత్నం కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : రైతుపై హత్యాయత్నానికి పాల్పడ్డ నిందితుడిని అరెస్టు చేసినట్లు మదనపల్లె తాలూకా సిఐ కళావెంకటరమణ తెలిపారు. మండలంలోని పెంచు పాడు పంచాయతి, పనసమాను కుంటకు చెందిన రైతు నారాయణ(63)కు అదే గ్రామంలో నివాసముండే శ్రీరాములు, చెన్నకేశవులుకు గత కొన్నేళ్ళుగా ఆస్తి తగాదాలు ఉండేవన్నారు. ఈ నెల 3న రాత్రి నారాయణ ఇంటిలో ఉండగా, తన ప్రత్యర్థి చెన్నకేశవులు అతని ఇంట్లోకి వెళ్ళి కత్తి, కర్రలతో దాడిచేసి హత్యా యత్నంకు పాల్పడ్డాడని సిఐ తెలిపారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయ పడిన బాధి తుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. చెన్నకేశవులు పెంచుపాడు సమీపంలో ఉండగా అదుపులోకి తీసుకుని, అరెస్టు చేసినట్లు తెలిపారు.

12 మంది పేకాట రాయుళ్లు..

పుల్లంపేట: ఓబులవారిపల్లి మండలం మంగంపేట వద్ద 12 మంది పేకాట రాయుళ్లను అరెస్టు చేసి వారి నుంచి రూ. 1,66,300లు నగదును స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ సిఐ వెంకటేశ్వర్లు తెలియజేశారు. ఎస్ఐ మహేష్ నాయుడు తన సిబ్బందితో దాడులు నిర్వహించగా 12 మంది పేకాటరాయలు అరెస్టు అయినట్లు తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని మహిళకు గాయాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : రోడ్డు పక్కన నిలబడిన మహిళను ట్రాక్టర్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడింది. టూ టౌన్ సిఐ రామచంద్ర తెలిపిన కథనం మేరకు.. మదనపల్లె శ్రీవారినగర్‌లో ఉంటున్న లక్ష్మీదేవి(45) కురబలకోట మండలం, సర్కారుతోపులో ఉన్న వ్యవసాయ బోరువద్దకు వెళ్లేందుకు గురువారం స్థానిక రింగురోడ్డు వద్దకు వెళ్లి ఆటో కోసం నిలబడి ఉందని చెప్పారు. అదే సమయంలో చంద్రాకాలనీ వైపు నుంచి వేగంగా వచ్చిన ఓ ట్రాక్టర్ లక్ష్మీదేవిని ఢీకొని వెళ్లి పోయిందన్నారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ బాధితురాలిని స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. పరీక్షించిన వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతి కి రెఫర్ చేశామని పేర్కొన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.